సాక్షి సంగారెడ్డి

గురువారం । 22 । మే । 2025



ఉద్యానానికి ఊతం..

ములుగులోని ఫల పరిశోధన కేంద్రం ఉద్యాన పంటల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తోంది. వివరాలు 8లో ▸



చేపలు మృత్యువాత..

నర్సాపూర్ పట్టణంలోని కోమటికుంటలో బుధవారం 10 క్వింటాళ్ల చేపలు మృత్యువాత పడ్డాయి. వివరాలు 8లో ▸



శీతల గిడ్డంగిపై శీతకన్ను

గుమ్మడిదల మండలంలో నిర్మించిన శీతల గిడ్డంగి ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పకడ్బందీగా సీఎం పర్యటన ఏర్పాట్లు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ముఖ్యమంత్రి జహీరాబాద్‌లో ఈనెల 23న పర్యటించనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...హెలీపాడ్ నుంచి సభాస్థలి వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ రూట్లు, స్టేజి అలంకరణ, పరిశుభ్రత, హెల్త్ క్యాంపులు, భగీరథ నీరు, టాయిలెట్స్ తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్‌లోని తన స్వగృహం ఆవరణలో బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ చేసిన అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలను గురించి ఎమ్మెల్యే వివరించారు. ఆయన చూపిన బాటలో ప్రతీ ఒక్కరూ పయనించాలన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ వివేకానంద్, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ తహసీల్దార్‌గా వెంకటేశ్



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు: అమీన్‌పూర్ నూతన తహసీల్దార్‌గా వెంకటేశ్ బుధవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీపై వికారాబాద్ వెళ్లారు. ఆయన స్థానంలో వికారాబాద్ నుంచి వెంకటేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ, అధికారులు సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమీన్‌పూర్ పరిధిలో ప్రభుత్వ భూములు కాపాడటంలో నిరంతరం కృషి చేస్తామన్నారు. అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ కవితాదేవి పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయులకు న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. న్యాయం ప్రతీ ఒక్కరి హక్కు అని ప్రతి ఒక్కరికీ చట్టాల గురించి తెలియాలన్నారు. ఉపాధ్యాయుల పట్ల సమాజంలో మంచి గౌరవం ఉంటుందని తెలిపారు. ఉత్తమమైన విద్యాబోధనతోపాటు బాలకార్మిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

సంగారెడ్డి తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



సంగారెడ్డి టౌన్: ఎన్నికల బదిలీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లిన జయరాం ఇటీవల సంగారెడ్డి జిల్లాకు తిరిగివచ్చారు. బుధవారం జరిగిన బదిలీలలో భాగంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆయనను సంగారెడ్డి మండల తహసీల్దార్‌గా నియమించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ దేవదాస్ జిన్నారం మండలానికి బదిలీ అయ్యారు.

మంజీరాపై డ్యాం!

రోడ్ కమ్ డ్యాం నిర్మాణానికి యోచన

- ప్రభుత్వం పరిశీలన
- తీరనున్న జిల్లా తాగు, సాగు నీటి అవసరాలు
- భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం
- బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతలకు మేలు



నారాయణఖేడ్: రాయిపల్లి వంతెన వద్ద ప్రవహిస్తున్న మంజీరానది

నారాయణఖేడ్: ఇన్నాళ్లు తాగునీటి అవసరాలకే పరిమితంగా మారిన మంజీరా నది ఇక నుంచి సాగునీటి అవసరాలూ తీర్చే నదిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంజీరా నదిపై సింగూరు వద్ద డ్యాం నిర్మించారు. నిర్మాణం నుంచి హైదరాబాద్ జంటనగరాలతోపాటు, జిల్లాలోని ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గాలకు చాలా ఏళ్లు తాగునీటి అవసరాలు తీరుస్తుంది. ఆందోల్ నియోజకవర్గంలో కొంతమేర సాగునీటికి ఇటీవల ఉపయోగ పడుతున్నా చాలా ప్రాంత రైతులకు ఉపయోగం లేకుండా మారింది. సింగూరు ప్రాజెక్టు నిర్మాణం కారణంగా సారవంతమైన భూములు కోల్పోయి జిల్లా రైతులు నష్టపోయినా జిల్లాలో సాగుకు ఉపయోగం లేకుండా మారిందన్న అపవాదు ప్రాజెక్టుపై ఉంది. కాగా, మంజీరా నది తాగునీటితోపాటు సాగునీటి అవసరాలు తీర్చడం, భూగర్భ జలాలు పెంపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మహారాష్ట్రలోని బాలాఘాట్ కొండల్లో పుట్టిన మంజీరా నది కర్ణాటక మీదుగా ప్రవహిస్తూ ఖేడ్ నియోజకవర్గంలో గౌడ్గాం జన్‌వాడ వద్ద తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో 45కిలోమీటర్ల మేరకు నది ప్రవాహం ఉంటుంది.

నదిపై రబ్బర్ డ్యాం!

మంజీరా నదిపై గత బీఆర్‌ఎస్ హయాంలో నాటి ప్రభుత్వం భారీ చెక్‌డ్యాంలను నిర్మించి ఎక్కడికక్కడ నీటి నిల్వలు పెంచాలని నిర్ణయించింది. కానీ, ఇది కార్యరూపం దాల్చలేదు. నది భారీ వైశాల్యంతో పారుతుండటంవల్ల చెక్‌డ్యాంల నిర్మాణం సాధ్యపడదని అధికారులు ప్రభుత్వానికి సూచించారు. కాగా, ఇటీవల భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వద్ద జిల్లా నాయకులు మంజీరాపై రోడ్‌కమ్ డ్యాం నిర్మాణం చేపట్టి తాగు, సాగునీటితోపాటు, ప్రాంత భూగర్భ జలాలు పెంపొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ ఏడు వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల సింగూరు ప్రాజెక్టు నిండటం వల్ల మిగతా నీటిని నిజాంసాగర్ ద్వారా గోదావరి నదిలోకి వృథాగా వదిలేయాల్సి వస్తుంది. దీన్ని నివారించేందుకు నదిపై మహారాష్ట్రలో నిర్మించిన తరహాలో రోడ్‌కమ్ డ్యాం నిర్మాణం చేపట్టాని కోరారు. దీంతో అధికారులతో సంప్రదించగా నూతన టెక్నాలజీ ద్వారా మూసీ, డిండీ ప్రాజెక్టుకు చేపడుతున్న తరహాలో రబ్బర్ డ్యాం నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రయోజనం ఉంటుందని అధికారులు వివరించారు. ఈ మేరకు తగు ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి అధికారులకు సూచించారు.

రాయిపల్లి వద్ద నిర్మాణం!

మంజీరా నదిపై రాయిపల్లి వద్ద భారీ వంతెన వద్ద రోడ్‌కమ్ డ్యాం తరహాలో వంతెనకు నీటి ఉధృతితో నష్టం వాటిల్లకుండా నది ప్రవేశం వైపు రబ్బర్ డ్యాం నిర్మించాలని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీని నిర్మాణంకు రూ.120కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నూతన టెక్నాలజీతో నిర్మించే డ్యాం వల్ల సుమారు 10 నుంచి 12 టీఎంసీల వరకు ఎగువన నీటిని స్టోరేజీ చేసుకునే అవకాశం ఉంది. అవసరాల మేరకు ఈ డ్యాంను హెచ్చు తగ్గులూ చేసుకునే వీలుందని అధికారులు పేర్కొన్నారు. మంజీరాపై ఖేడ్, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల తాగునీటి పథకాలు ఉండటం వల్ల బ్యాక్‌వాటర్ సామర్థ్యమూ పెరిగి నీటి పథకాలకూ ప్రయోజనం కలుగనుంది. నదిలో నీటి నిల్వలు ఉండటంవల్ల భూగర్భ జలాలు పెరిగి వేసవిలోనే మూడు నియోజకవర్గాల్లోని మెజార్టీ మండలాల్లో బోరు, బావులు ఎండిపోయే పరిస్థితి ఉండదు. ప్రాజెక్టుపై 3.10లక్షల ఎకరాల ఆయకట్టుతో నిర్మాణంలో ఉన్న బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతలకూ ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాకు మేలు...



మంజీరాపై రబ్బర్ డ్యాంను రోడ్‌కమ్ డ్యాం తరహాలో నిర్మించడం వల్ల జిల్లా అవసరాలను ఎంతగానో తీర్చనుంది. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రాథమిక అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఖేడ్, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలు తీరడంతోపాటు భూగర్భ జలాలు భారీగా పెరుగుతాయి. జిల్లా అవసరాలకు, వేలాది మంది రైతులకు మేలు చేకూరుతుంది. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతలకూ దీని వల్ల ప్రయోజనం ఉండనుంది.

– సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్

ఏ ముఖం పెట్టుకొస్తున్నావ్?

- తాము చేసిన పనులకు ప్రారంభోత్సవాలా!
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు ప్రశ్న
- జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి పథకాలను అటకెక్కించారు
- కేసీఆర్ మంజూరు చేసిన నిధులు వెనక్కి ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్: తమ ప్రభుత్వ హయాంలో జహీరాబాద్‌లో చేసిన పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని ప్రారంభించడానికి వస్తున్నారని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ తీరు చూస్తూ సొమ్మొకరిది సోకొకరిది అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. బుధవారం రాత్రి జహీరాబాద్ వచ్చిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌లతో కలసి విలేకరులతో మాట్లాడారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిందని సీఎం రిబ్బన్ కట్‌చేయడానికి వస్తున్నాడని ఎద్దేవా చేశారు. కేంద్రీయ విద్యాలయాన్ని అప్పటి బీఆర్‌ఎస్ ఎంపీ తీసుకువచ్చిందని, అందులో విద్యార్థులు చేరి ఆరు నెలలవుతుంటే ఇప్పుడు కొబ్బరికాయ కొడతారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో మా పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలతోపాటు నా సొంత నిధులను కలిపి కోటి రూపాయలతో బసవేశ్వర విగ్రహాన్ని కడితే ఈ ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారా అని వ్యాఖ్యానించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి రేవంత్‌రెడ్డి ఏమి ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన రూ.25 కోట్లను, మున్సిపాలిటీకి ఇచ్చిన రూ.30 కోట్లు కూడా వాపస్ తీసుకున్నారని విమర్శించారు.

ఇచ్చినవి కూడా గుంజుకున్నారు

ఎమ్మెల్యే మాణిక్‌రావు వినతి మేరకు గ్రామీణ రోడ్లకు కేసీఆర్ రూ.50 కోట్లు మంజూరు చేస్తే అవి కూడా గుంజుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. జహీరాబాద్ మీద రేవంత్‌రెడ్డి ప్రేమ ఉంటే తీసుకున్న నిధులను వెంటనే తిరిగివ్వాలని, పాతవి ఇచ్చి కొత్తగా రూ.100కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించడం కాదు సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసే బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులను పునరుద్ధరించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రజల తరఫున డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 21వేల మెట్రిక్ టన్నుల జొన్నలు కొని రైతులకు ఇవ్వాల్సిన రూ.72కోట్లలో ఇప్పటి వరకు సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క రూపాయి కూడ ఇవ్వలేక పోయారన్నారు. రేవంత్‌రెడ్డిది పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని, ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా పూర్తిగా అమలు చేయలేక పోయిందని మండిపడ్డారు.

మీది రైతు ప్రభుత్వమా?

కాంగ్రెస్ వాళ్లు మాట్లాడితే రైతు ప్రభుత్వం అని అంటున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రైతు బంధు ఎగ్గొట్టడం, రైతు బీమా కట్టక పోవడం, పంటల బీమా చెల్లించక పోవడం రైతు ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. రైతులకు బోనస్ ఒక్క రూపాయి ఇవ్వక పోవడం, మొలకెత్తిన ధాన్యం కొనకపోవడం, విత్తనాల ధరలు పెంచడం రైతు ప్రభుత్వమా? ఏ రకంగా మీది రైతు ప్రభుత్వం? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారు.

సేవలు బాగున్నాయా..?

ప్రభుత్వాస్పత్రిలో రోగుల బాగోగులపై ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆరా



వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను కలిసి ఆస్పత్రి సేవల గురించి వారి బాగోగుల గురించి ఆరా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, ఇతర వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు వారితో మాట్లాడుతూ..ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రతీ విభాగంలో సిబ్బంది అంకితభావంతో సేవలందించాలన్నారు. వచ్చే నెలలో తిరిగి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోగులకు ఉత్తమ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, బండి మోహన్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

- ప్రశంసాపత్రాలు అందజేసిన డీజీపీ



ఉన్నతాధికారుల చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ శివలింగం

సంగారెడ్డి జోన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా బొల్లారం, జహీరాబాద్ సి.ఐలు రవీందర్‌రెడ్డి, శివలింగంతోపాటు హెడ్ కానిస్టేబుల్ రఫిక్, సీత్య నాయక్‌లను అభినందించి వారికి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోశ్ పంకజ్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా అతి తక్కువ సమయంలో కేసును పరిష్కరించి నిందితుడికి మరణ శిక్ష విధించడంలో బొల్లారం సి.ఐతోపాటు హెడ్ కానిస్టేబుల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో బెస్ట్ కన్విక్షన్ అవార్డ్ అందుకున్నారన్నారు. కేవలం వారం రోజుల వ్యవధిలో సుమారు రూ.3 కోట్ల విలువ గల ఆస్తి నేరాన్ని పరిష్కరించి, అత్యుత్తమ కేసుల ఛేదనలో జహీరాబాద్ సి.ఐ రాష్ట్ర స్థాయిలో జిల్లా గుర్తింపు పొందారని వివరించారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు రావడం సంతోషకరమన్నారు.

బతుకు బిడ్డా



పెరిగిన ఆడ పిల్లల జననాలు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలతో తగ్గిన శిశు మరణాలు
- ఉమ్మడి మెదక్ జిల్లా (2020)లో 58,337 మంది పుట్టుక
- 2021లో 57,902 మంది జననం
- సీఆర్‌ఎస్-2021 నివేదికలో వెల్లడి

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కరోనా సమయంలో జననాలు స్వల్పంగా తగ్గాయి. లింగనిష్పత్తి పరంగా ఆడ పిల్లల జననాలు పెరిగాయి. కేంద్ర జనగణన విభాగం ఇటీవల విడుదల చేసి సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్‌ఎస్) నివేదిక-2021లో వివరాలు వెల్లడయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో జననాలు 57,802, మరణాలు 25,507 జరిగాయి. 2021లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించడంతో 2020తో పోలిస్తే శిశు మరణాలు తగ్గాయి. సీఆర్‌ఎస్ నివేదిక మేరకు జిల్లాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2020లో 58,337 మంది జన్మించగా, 2021 లో 57,802 మంది పుట్టారు. ఈ నివేదిక ప్రకారం చూస్తే జననాలు 535 తగ్గాయి. 2020లో మగవారు 30,288 మంది, 2021లో 29,910 మంది, 2020 లో ఆడ వారు 28,049, 2021లో 30,288 మగవారు జన్మించారు. 2020లో 1,000 మంది మగవారికి 926 ఆడ పిల్లలు, 2021లో 1,000 మంది మగ పిల్లలకు 932 మంది ఆడ పిల్లలు పుట్టారు. దీని ప్రకారం చూస్తే ఆడ పిల్లల జననాలు పెరిగాయి.

2021లో జననాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
మెదక్	7,793	6,983	14,776
సిద్దిపేట	6,944	6,266	13,210
సంగారెడ్డి	15,173	14,643	29,816

పెరిగిన మరణాలు

2020లో 21,260 మంది, 2021లో 25,080 మంది చనిపోయారు. 2020-21తో పోలిస్తే మొత్తంగా 3,820 మంది అధికంగా మృతి చెందారు. కరోనా రెండో విడత 2021లో విజృంభించింది. దీంతో మరణాలు ఎక్కువగా పెరిగాయి అని చెప్పవచ్చు. చనిపోయిన వారిలో ఆడవాళ్ల కంటే మగవారే అధికంగా ఉన్నారు.

2021లో మరణాలు

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
మెదక్	4,907	3,097	8,004
సిద్దిపేట	4,298	3,059	7,357
సంగారెడ్డి	5,079	4,640	9,719

తగ్గిన శిశు మరణాలు



ఉమ్మడి మెదక్ జిల్లాలో శిశు మరణాలు తగ్గాయి. 2020లో 541 మంది చిన్నారులు మృతి చెందితే అందులో మగవాళ్లు 285, ఆడవాళ్లు 256 మంది ఉన్నారు. 2021లో 427 మంది చిన్నారులు మృతి చెందగా అందులో మగవారు 234, ఆడ శిశువులు 193 మంది ఉన్నారు. రెండేళ్లలో ఆడ శిశువులు తక్కువగానే మృతి చెందారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో శిశు మరణాలు తగ్గాయని చెప్పవచ్చు.

2021లో శిశు మరణాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
మెదక్	148	119	267
సిద్దిపేట	20	19	39
సంగారెడ్డి	66	55	121

8 లక్షల ఎకరాల్లో సాగు

- వానాకాలం పంటల అంచనా
- గతేడాది కంటే పెరిగిన సాగు విస్తీర్ణం

సంగారెడ్డి జోన్: ఈ ఏడాది ఖరీఫ్ పంటల ప్రణాళికను ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లాలో వానాకాలం సాగు పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 8,04,512 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు అంచనా వేశారు. ఈ మేరకు సాగు విస్తీర్ణం, పంట రకంతోపాటు సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాలు తదితర అంశాలతో కూడిన ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు ఖరారు చేశారు. గతేడాది కంటే ఈసారి సుమారు 70 వేల ఎకరాల్లో అత్యధికంగా సాగు చేయనున్నట్లు ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లాలో గతేడాది సాగు చేసిన పంటల ఆధారంగా సాగు ప్రణాళికలను సిద్ధం చేశారు.



పత్తి పంట

అత్యధికంగా పత్తి సాగు

జిల్లాలో సాగు చేస్తున్న పంటల్లో అత్యధికంగా పత్తి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. కొన్నేళ్లుగా ప్రతీ ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది సుమారు 70వేల ఎకరాలకు పైగా పత్తి పంట అధికంగా సాగు చేయనున్నట్లు అంచనా వేశారు. ఈ మేరకు 7,75,078 మేర పత్తి ప్యాకెట్లు అవసరం ఉన్నట్లు తెలిపారు.

వరి, సోయాబీన్, కందితోపాటు ఇతర పంటలు

పత్తి పంట తర్వాత అత్యధికంగా జిల్లాలో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 1,65,173 ఎకరాలు, కంది 84,821, సోయాబీన్ పంట 79,163, మొక్కజొన్న 7,983 పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఆయా పంటలకు ఎంత మేర విత్తనాలు అవసరమో వాటి ప్రణాళికలను సైతం సిద్ధం చేశారు.

వానాకాలం సీజన్‌లో పంటల సాగు అంచనా వివరాలు

పంట రకం	గత సం.. సాగువివరాలు	ప్రస్తుత సం.. సాగు అంచనా
వరి	1,50,157	1,65,173
మొక్క జొన్న	7,257	7,983
పత్తి	3,52,308	3,87,539
కంది	77,110	84,821
సోయాబీన్	71,966	79,613
పెసర	13,478	14,826
మినుములు	8,897	9,787
ఇతరములు	26,339	26,256
హార్టికల్చర్	25,534	28,964
మొత్తం	7,33,047	8,04,512

ప్రణాళికలను సిద్ధం చేశాం



వానకాలం సీజన్‌లో భాగంగా సాగు చేసే పంటలను అంచనా వేసి ప్రణాళికలను తయారు చేయడం జరిగింది. సాగు చేసే పంటలకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అంచనా వేశాం. గతేడాది కంటే ఈసారి పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేసే అవకాశముంది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి.

ఎరువుల అంచనా ఇలా

జిల్లాలో పంటలకు అవసరమయ్యే ఎరువుల కోసం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికలను సిద్ధం చేశారు. యూరియా 41,900, డీఏపీ 16,045, ఎంఓపీ 19,682, కాంప్లెక్స్ 36,804, ఎస్ఎస్‌పీ 9,225 మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే వివిధ రకాల ఎరువులు 18,757 మెట్రిక్ టన్నులు అందుబాటులోనే ఉన్నాయి. మొత్తంగా ఈ ఏడాది 1,23,656 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమున్నట్లు ప్రణాళికలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

మల్బరీ సాగుతో అధిక లాభాలు

- సెరి కల్చర్ ఏడీఏ ఇంద్రసేనారెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మల్బరీ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని సెరి కల్చర్ ఏడీఏ ఇంద్రసేనారెడ్డి సూచించారు. మండలంలోని గాగిళ్లాపూర్‌లో మల్బరీ సాగుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రోత్సాహకంగా మల్బరీకి సంబంధించిన యూనిట్ నిర్మాణంతోపాటు మొక్కలు, డ్రిప్, స్ప్రింక్లర్ తదితరాలకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతినెలా ఆదాయం వస్తుందన్నారు. సమావేశంలో ఎస్‌ఓ శర్మ, గ్రామ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు పులి శ్రీనివాస్, మాచం శ్రీనివాస్, రైతులు అన్నాడి శ్రీధర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, బాలయ్య, రమణా రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రారంలో లుక్ ఆఫ్ తెలంగాణ భామ సందడి



ఆర్తీని అభినందిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మిస్ రేడియన్స్ లుక్ ఆఫ్ తెలంగాణ అందాల పోటీల్లో కీర్తి కిరీటాన్ని కైవసం చేసుకున్న అందాల భామ తుమ్మల ఆర్తీ అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని తన స్వగ్రామమైన రుద్రారంలో బుధవారం సందడి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో అమీర్ పేట స్మైల్ ప్రొడక్షన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అందాల పోటీల్లో పాల్గొన్న ఆమె విజేతగా నిలిచారు. ఆర్తీకి క్లౌడ్ మీడియా చైర్మన్ రామకృష్ణ, హైకోర్టు అధికారి వేణుగోపాల్, రిజిస్ట్రేషన్ డీఐజీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విజేత కిరీటంతోపాటు చెక్కును అందించారు. స్వగ్రామానికి వచ్చిన ఆమెను గ్రామస్తులు ఘనంగా స్వాగతించి సన్మానించారు. గ్రామానికి చెందిన తుమ్మల యాదగిరి, మాదమ్మ దంపతుల కూతురు ఆర్తీ మహారాష్ట్రలోని నాగపూర్‌లో బీఈ ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ పట్టా పొందారు.

ఎస్టీ జాబితాలోకి నక్కల కులస్తులు

- ఫలించిన 8 ఏళ్ల పోరాటం



ముత్యంపేట గ్రామస్తులకు కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

తొగుట(దుబ్బాక):తొగుట మండలం ముత్యంపేటకు చెందిన నక్కల (పిట్టల) కులస్తుల 8 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలించింది. ప్రభుత్వం నక్కల కులస్తులను గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చింది. ఇక నుంచి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అందనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ గ్రామాన్ని సందర్శించి పూర్వ పరాలను విచారించారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్ తన కార్యాలయంలో వారికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. దీంతో గ్రామంలోని సుమారు 80 కుటుంబాలకు అన్ని రకాల ప్రభుత్వ సౌకర్యాలు పొందుతారు. వారి న్యాయ పోరాటానికి సామాజిక సమరసత వేదిక అండగా నిలిచింది. ఈ సందర్భంగా వారు సంతోషం వ్యక్తంచేశారు.

ఉద్యానానికి ఊతం..
ఫల రాజ కేంద్రం

ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. రైతన్నలకు ఆదాయం సమకూరేలా పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తుంది. దీనిలో భాగంగా రాష్ట్రంలో సాగుకు అనువైన వివిధ రకాల ఉద్యాన మొక్కలను వృద్ధి పరిచి, పంపిణీ చేయడం, ప్రత్యక్ష పద్ధతిలో శిక్షణ, రైతుల ఆదాయ వనరులు పెంపొందింపజేయడం లక్ష్యంగా ప్రభుత్వం ములుగు మండల కేంద్రంలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్' ఫల పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ తెలంగాణ ప్రాంతానికి అనువైన రకాల పండ్ల మొక్కలు, రైతులు ఆసక్తి చూపే ఉద్యాన పండ్ల మొక్కలు, ఎకో ప్లాంటేషన్ మొక్కలను ఇక్కడ నర్సరీల్లో అభివృద్ధి చేసి రైతులకు అందజేస్తారు.

– ములుగు(గజ్వేల్)

- రైతులకు ఉపయోగపడేలా నర్సరీలు
- వృద్ధి చెందుతున్న ములుగు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'
- 53 ఎకరాల్లో వివిధ రకాల పంటలు
- మొక్కలతోపాటు శిక్షణ తరగతులు
- ఆదాయ పెంపు మార్గాలపై దృష్టి



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



కేంద్రంలో మిరుప మొక్కలు

ములుగు మండల కేంద్రం సమీపంలో రాజీవ్ రహదారి ఆనుకొని 53 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల మొక్కల పరిశోధన, అభివృద్ధి కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో కేవలం మొక్కలు అభివృద్ధి చేసి రైతులకు సకాలంలో పంపిణీ చేయడానికే పరిమితం కాదు. వాటి సాగు విధానంపై సంపూర్ణ అవగాహన కలిగించేలా కేంద్రంలో ప్రత్యక్ష శిక్షణ కూడా ఇస్తారు. రైతుల చేతుల మీదుగా ఆయా పద్ధతులు ఆచరింపజేస్తూ వివరిస్తారు. మామిడి మొక్క కొమ్మ ఎలా కత్తిరించాలి.. ఏ సీజన్‌లో కత్తిరింపు జేయాలి.. తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను సలహాలతో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో ప్రాక్టికల్‌గా చూపిస్తారు. దీంతో ఉద్యాన తోటలపై రైతులకు సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. పక్కనే ఉద్యాన యూనివర్సిటీ ఉండటంతో ఇక్కడ రైతులతోపాటు ఉద్యాన విద్యార్థులకు సైతం శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. సైంటిస్టులు అందుబాటులో ఉండటం వల్ల శాస్త్రవేత్తల ద్వారా మరింత మెరుగైన శిక్షణ లభిస్తుంది.

ప్రత్యక్షంగా ప్రదర్శన క్షేత్రాలు

ఉద్యాన రైతులకు శిక్షణ కోసం ప్రత్యేకంగా 53 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. అందులో డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ఫర్టిగేషన్ తదితర విధానాలు ఆచరిస్తున్నారు. ఆ విధంగా వృద్ధి చేసిన డెమో ప్లాట్లలో కొమ్మల కత్తిరింపు, ఎరువుల వాడకం, సస్యరక్షణ తదితర అంశాలను ప్రత్యక్ష పద్ధతిలో చూపుతూ రైతుల్లో అవగాహన పెంపొందింపజేసేందుకు ఇవి ఉపయోగపడుతాయి.

పరిశోధన కేంద్రంలో ఎన్నెన్నో రకాలు

ములుగు ఫల పరిశోధన అభివృద్ధి కేంద్రం-సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ ప్రాంతానికి అనువైన ఉద్యాన పండ్ల మొక్కల రకాల అభివృద్ధి జరుగుతుంది. ఇందులో 17 రకాల మామిడి, 3 రకాల నిమ్మ, 5 రకాల జామ, 5 రకాల దానిమ్మ, 3 రకాల డ్రాగన్ ఫ్రూట్, 4 రకాల చింత, ఒక రకం సీతాఫలం, 2 రకాల వెదురు, 9 రకాల ఆయిల్ పామ్ తదితర వెరైటీలు ఇక్కడి డెమో ప్లాట్లలో సాగు చేశారు. అంతే కాకుండా శ్రీగంధం, కూరగాయలు, వివిధ రకాల పూల మొక్కలను పెంచుతున్నారు.

రాయితీలు అనుసంధానంగా..

రైతులు ఎన్ని ఎకరాల్లో.. ఏ రకం ఉద్యాన పండ్ల మొక్కలు సాగు చేయాలనుకుంటున్నారో ముందుగా కేంద్రంలో నమోదు చేయించాలి. అందుకు అనుగుణంగా ఆయా మొక్కలను నర్సరీలో వృద్ధి చేసి సకాలంలో రైతులకు అందజేస్తారు. అయితే నర్సరీ ద్వారా మొక్కలు తీసుకున్న రైతులు రాయితీని మాత్రం వివిధ ఉద్యాన పథకాల ద్వారా పొందాల్సి ఉంటుంది.



నర్సరీలో జామ మొక్కలు



రైతులకు అవగాహన కోసం మామిడి ప్రదర్శన క్షేత్రం

పరిశోధనల నిలయం

తెలంగాణ ప్రాంత భూములకు అనువైన పండ్ల రకాలపై ములుగు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' పరిశోధన జరుపుతుంది. మార్కెట్ డిమాండ్‌కు అనువైన రకాలు ఏమిటి, అధిక దిగుబడి రకాలు ఏమిటి తదితర అంశాలు పరిగణలోకి తీసుకొని మొక్కల వృద్ధి కోసం పరిశోధనలు జరుపుతారు. డిమాండ్‌కు అనువైన పండ్ల రకాలను, ఇతర రాష్ట్రాల వెరైటీలు సైతం ఇక్కడ అభివృద్ధి చేస్తారు. దీంతో రైతులు పండ్ల వెరైటీల కోసం ఎక్కడెక్కడో తిరగాల్సిన బాధ ఉండదు. ఓ సూపర్ బజార్ మాదిరి అన్ని ఇక్కడే లభ్యమవుతాయి.

దరఖాస్తు చేసుకుంటే మొక్కలు సిద్ధం చేస్తాం



తెలంగాణ ప్రాంత ఉద్యాన రైతులకు ఊతంగా రాష్ట్రంలోనే ఏర్పాటైన తొలి కేంద్రమిది. ఇక్కడ తెలంగాణకు అనువైన వివిధ రకాల ఉద్యాన పండ్ల మొక్కలు, శ్రీగంధం తదితర అటవీ అభివృద్ధికి దోహదపడే రకాల పరిశోధన, వాటిని రైతులకు అందజేసేందుకు నర్సరీల ద్వారా అభివృద్ధి చేయడం జరుగుతుంది. రైతులు దరఖాస్తు చేసుకుంటే ఆ సీజన్ వరకు మొక్కలు సిద్ధం చేస్తాం. ఆ తర్వాత మొక్కలను కేంద్రం నుంచి తీసుకెళ్లవచ్చు. రైతులు ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి సహకారం కోసం అసిస్టెంట్ డైరెక్టర్ 89777 14250 లేదా ఉద్యానశాఖ అధికారి 90001 36490 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు.

– బీ.శ్రీధర్, ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఫ్రూట్స్ అసిస్టెంట్ డైరెక్టర్

వేర్వేరు ప్రమాదాల్లో 20 మందికి గాయాలు

మెదక్ జిల్లాలో బుధవారం జరిగిన నాలుగు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

కారు, డీసీఎం ఢీకొనడంతో ఎనిమిది మంది

శివ్వంపేట(నర్సాపూర్) : కారును డీసీఎం ఢీకొట్టడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన తూప్రాన్-నర్సాపూర్ హైవేపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కొడిపల్లి మండలం మున్‌రాయి గ్రామానికి చెందిన ముచ్చర్ల రమేశ్ కుటుంబ సభ్యులు శివ్వంపేట మండలం గోమారంలో మంగళవారం రాత్రి జరిగిన శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి 11 గంటలకు స్వగ్రామానికి కారులో బయలుదేరారు. చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో శభాష్‌పల్లిలోని సుగుణ పరిశ్రమ నుంచి పరంలోడుతో నర్సాపూర్ వైపునకు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి వీరి కారుని ఢీకొట్టింది. దీంతో కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడటంతో 8 మందికి గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామాయంపేట వద్ద ఐదుగురు

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రామాయంపేట వస్తుండగా కోమటిపల్లి స్టేజీ వద్ద రోడ్డుకు అడ్డంగా గొర్రెలు రావడంతో బస్సు డ్రైవర్ స్లో చేశాడు. వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కామారెడ్డి జిల్లా తిప్పాపూర్‌కు చెందిన ప్రమీల స్వల్పంగా గాయపడింది. మరో ఘటనలో దౌల్తాబాద్ వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాలపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



దెబ్బతిన్న కారు

కారును బొలేరో ఢీకొట్టడంతో ఐదుగురు

తూప్రాన్: కారును బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన తూప్రాన్-గజ్వేల్ రహదారిపై మండలంలోని యావపూర్ చౌరస్తా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణంలోని హైదర్‌గూడకు చెందిన పరశపోగు రమేశ్ కారులో నలుగురు మేస్త్రీలను సిద్దిపేట జిల్లా అనంతగిరిపల్లెకు తీసుకెళ్తున్నాడు. యావపూర్ చౌరస్తా వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన బొలేరో వాహనం కారును, మరో ద్విచక్ర వాహనంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ప్రవీణ్, శివ, సురేశ్, మరియదాస్‌తోపాటు బైక్‌పై ఉన్న శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

దంపతులకు తీవ్ర గాయాలు

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం నర్సాపూర్-తూప్రాన్ రహదారిలోని కోమటికుంట సమీపంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హనుమంతపూర్‌కు చెందిన అరట్ల వినయ్, భార్య రజిత కలిసి బైక్ పై నర్సాపూర్ వైపు వస్తున్నారు. ప్రమాదవశాత్తు కారుతోపాటు లారీని ఢీకొట్టారు. దంపతులిద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై నర్సాపూర్ ఎస్సై లింగంను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కవి, చిత్రకారుడు ప్రవీణ్ కన్నుమూత

– మెడికల్ కళాశాలకు పార్థివదేహం



ప్రవీణ్ (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు, కళాకారుడు, కవి చొప్పదండి ప్రవీణ్ (పెంటన్న) (72) మంగళవారం కన్నుమూశారు. ఈయన కాకతీయ యూనివర్సిటీలో తెలుగు ఉపన్యాసకులుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. సిద్దిపేట ప్రేరణ సాహితీ సంస్థ, నవ్య కళానికేతన్‌కు సేవలు అందించారు. ప్రముఖ రచయిత శారద కథలపై పరిశోధన చేశారు. కుటుంబ సభ్యుల అనుమతి మేరకు పెంటన్న పార్థివదేహాన్ని సిద్దిపేట మెడికల్ కళాశాలకు పరిశోధనల కోసం అందజేశారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిదారెడ్డి, కవులు కొమురవెల్లి అంజయ్య, పప్పుల రాజిరెడ్డి, వేముగంటి మురళీ, తైదల అంజయ్య, భగవాన్ రెడ్డి , మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, తెలంగాణ రచయితల సంఘం, మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు, తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లి టీ జంక్షన్ సమీపంలోని మొదటి బ్రిడ్జి వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు బ్రిడ్జి సమీపంలోని వాగులో చేపలు పడుతుండగా బ్రిడ్జి 8వ కాల్వ వద్ద మృతదేహం కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని జాలర్ల సాయంతో బయటకు తీశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ మతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తి నలుపు రంగు జీన్స్ ప్యాంట్, ఆకుపచ్చ కలర్ చొక్కా ధరించాడని, ఛాతి ఎడమ వైపు సంగీత అనే పేరుతో పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అసంపూర్తిగా త్రిశూలం, ఢమరుకం పనులు

- మల్లన్న ఆలయం వద్ద ఏర్పాటు
- రూ.63 లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభం
- డిజైన్ మార్పుతో పెరిగిన వ్యయం
- మరో రూ.20 లక్షలకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని భక్తులు పరమశివుడి ప్రతిరూపంగా భావిస్తారు. ఆలయ గొప్పతనాన్ని చాటడంతోపాటు శివుడి ప్రతి రూపం ప్రతిబింబించేలా మల్లన్న ఆలయంపై ఉన్న ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం, ఢమరుకం ఏర్పాటుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నా పనులు పూర్తి చేయడానికి నిధులు కొరత వెంటాడుతుంది. గతేడాది స్వామి వారి కల్యాణానికి ముందే పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆలయ అధికారులు ప్రకటించి పనులు వేగంగా చేసినా నిధులు సరిపోక అసంపూర్తిగా వదిలేశారు. రూ.63 లక్షల వ్యయంతో 2023 సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించారు. పనులు చివరి దశకు చేరుకోగా హైదరబాద్‌లోని ఓ కార్ఖానాలో స్టీల్‌తో త్రిశూలం, ఢమరుకం, ఓం ఆకారాలను తయారు చేయించారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేందుకు వీలుగా ఆకారాలను బిగించేందుకు రెండు అంతస్తుల భవనం నిర్మించారు. కానీ డిజైనింగ్‌లో మార్పు వల్ల ప్రతిపాదించిన రూ.63 లక్షల వ్యయం సరిపోలేదని అదనంగా రూ.20 లక్షలు అవసరమవుతాయని నిధులు మంజూరు చేస్తే పనులు చేస్తామని నవంబర్‌లో దేవాదాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంత వరకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగలి అన్న చందంగా మారాయి. కమిషనర్ అనుమతి కోసం ఫైల్ పంపించామని, అనుమతి రాగానే పనులు పూర్తి చేస్తామని ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు.



మధ్యలోనే ఆగిన పనులు

సన్నాసుల సన్నాయి నొక్కులకు భయపడ..

- ఓట్ల రాజకీయం కాదు.. అభివృద్ధి ముఖ్యం
- ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాక : సన్నాసుల సన్నాయి నొక్కులకు భయపడనని.. చట్టం తెలిసిన వాడిని న్యాయబద్ధంగా తుదిశ్వాస విడిచేంత వరకు ప్రజల కోసమే పాటుపడుతానని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన మెడికల్ అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్ల కోసమే రాజకీయాలు చేయడం కాదని అభివృద్ధి చేసి చూపించాలన్నారు. 7 ఏళ్లుగా ఐటీఐ భవన నిర్మాణం పూర్తి కాలేదని ఇది పూర్తయితే లోకల్ విద్యార్థులకు న్యాయం జరిగేదన్నారు. నేను ఎమ్మెల్యే అయ్యాకనే దుబ్బాక-ముస్తాబాద్ డబుల్ రోడ్డు, మెట్టు-చందాపూర్, దౌల్తాబాద్-చేగుంట రోడ్లు వేయించానన్నారు. దుబ్బాక అంబేడ్కర్ విగ్రహం నుంచి హబ్షీపూర్ చౌరస్తా వరకు ఫోర్‌లైన్ రోడ్డు కోసం బీఆర్ఎస్ హయాంలో సీఎం ను కలిస్తే నాకు పేరొస్తుందని ఆపించారన్నారు. దుబ్బాకలో మెడికల్ కాలేజీ ఎందుకు లేదని అడిగా, కనీసం నర్సింగ్ కాలేజీ పెట్టమంటే హరీశ్‌రావు వద్దన్నాడని ఆరోపించారు. కొత్త మండలాలకు తహసీల్దార్ కార్యాలయాలు లేవు దుబ్బాక రెవిన్యూ డివిజన్ కోసం పోరాడుతానన్నారు. దుబ్బాకలో మెడికల్ అసోసియేషన్ భవనంకు పార్టీలకు అతీతంగా రూ.10 లక్షలు ఇచ్చానన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వేంకటేశ్వరుడి ప్రతిమ అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యం దుబ్బాక అధ్యక్షుడు వడ్లకొండ శ్రీధర్, బింగి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రఘునందన్‌రావుకు వేంకటేశ్వరుడి ప్రతిమను అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

10 క్వింటాళ్ల చేపలు మృత్యువాత



చేపలను చూపుతున్న మత్స్యకారులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని కోమటికుంటలో బుధవారం సుమారు 10 క్వింటాళ్ల చేపలు మృత్యువాత పడ్డాయి. కోమటికుంటలోకి డ్రైనేజ్ నీళ్ల కలవడంతో చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. కుంట పైభాగంలో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, అధికారులు సరైన డ్రైనేజీ, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టకపోవడంతో నేరుగా కుంటలోకి కలుషిత నీరు చేరి చేపలు మృత్యువాత పడ్డాయని ఆవేదన చెందారు. చేపల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారులను ఆదుకోవాలని ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగం పోయిందని మానసిక ఒత్తిడితో..


ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



జ్ఞానేశ్వర్ మృతదేహం

రేగోడ్(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పోచయ్య కథనం మేరకు.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (30) గతంలో మిషన్ భగీరథలో ఉద్యోగం చేసేవాడు. ఓ కేసు వల్ల ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. మంగళవారం తన కుమారుడి జనన ధ్రువీకరణ పత్రం కోసం పెద్దశంకరంపేటకు వెళ్లాడు. బుధవారం తమ చేనులో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

– చెరువులో దూకి వ్యక్తి



చాకలి క్రిష్ణ మృతదేహం

కొడిపల్లి(నర్సాపూర్): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సదాశివపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. సదాశివపల్లి గ్రామానికి చెందిన చాకలి క్రిష్ణ(34) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మంగళవారం సాయంత్రం తాను ఎక్కడైనా వెళ్లి చనిపోతానని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులకు విషయం తెలిసి వెతకగా గ్రామ కనికల చెరువు తూమ్ వద్ద బట్టలు, ఫోన్ కనిపించాయి. రాత్రి చెరువులో వెతికినా జాడ దొరకలేదు. బుధవారం గజ ఈతగాళ్లతో వెతికించగా క్రిష్ణ మృతదేహం బయటపడింది. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు
- నిజామాబాద్ జట్టుకు బంగారు, మెదక్ జట్టుకు రజత పతకం

తూప్రాన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో గురుకుల పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గణేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. అనంతరం సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణగుప్త మాట్లాడుతూ. ఫైనల్‌లో పోటీల్లో మెదక్ జిల్లా-నిజామాబాద్ జిల్లా జట్లు హోరాహోరీగా పోటీ పడగా నిజామాబాద్ జట్టు 6-1 తేడాతో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. మెదక్ జిల్లా జట్టు రజత పతకం, హనుమకొండ జట్టు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాయని తెలిపారు. అనంతరం సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు మాట్లాడుతూ.. చండీఘర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ బాలుర జట్టు రాణించి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేత జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభిషేక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, కోశాధికారి రేణుక, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, మంచిర్యాల కార్యదర్శి కిరణ్, మాజీ కౌన్సిలర్ భగవాన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మామిండ్ల కృష్ణ, వివిధ జిల్లాల జట్ల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రజత పతకం సాధించిన మెదక్ జట్టు